సుశీకి చాలా భయంగా ఉంది. ఇంటర్వెల్ కాగానే హెచ్.ఎమ్. రూమ్ దగ్గరకి వచ్చిందికానీ లోపలకు వెళ్లటానికి ధైర్యం చాలడంలేదు. కర్టెన్ కొంచెం కదిలింది. "కమిన్!" అన్నారు హెచ్.ఎమ్.



"ఏమిటమ్మా!" అన్నారు ఆమె. "ఎందుకట్లా భయపడుతున్నావు? చెప్పు!" అన్నారు మళ్ళీ.

"మా క్లాసులో రమ ఏడుస్తోంది" అన్నది సుశీ.

హెచ్.ఎమ్. చిన్నగా నవ్వారు. "నీది ఏ క్లాసు? రమ ఎందుకు ఏడుస్తోంది? ఎవరైనా కొట్లాడారా?"

"ఊహు..." అంటూ పోట్లాడుకోలేదన్నట్టు తల అడ్డంగా తిప్పి, మెల్లగా చెప్పసాగింది సుశీ.

"తొమ్మిదో క్లాసు. రమ అంటే తెల్లగా, లావుగా ఉంటుంది. అది ఏడుస్తోంది. వసంత్ దాన్ని ఏడిపిస్తున్నాడు" అని ఆగింది.

ఆపావేం? చెప్పు అన్నట్లు చూసారు హెచ్.ఎమ్.

"వసంత్ చెడ్డమాటలంటున్నాడు" అన్నది సుశీ.

"ఏం మాటలు? - నువ్వు ఏంచెప్పాలనుకుంటున్నావో ధైర్యంగా చెప్పు" అంటూ హామీ యిచ్చారు హెచ్.ఎమ్.

# కాలిమహిమ

సుశీకి కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. "అది కాదు మేడమ్! రోజూ ప్రతి పీరియడ్‌లో అంటాడండీ! నేను రమ పక్కనే కూచుంటానుగా, నాకు వినిపించినా భయంలేకుండా అంటాడు మేడమ్!" అంటోందేగానీ సంగతేమిటో చెప్పటం లేదు సుశీ.

హెచ్.ఎమ్ గారికి చాలా ఓర్పు. "రమతో మాత్రమే చెడ్డ మాటలంటున్నాడా? ఏమిటవి?" అన్నారామె. సుశీ చెప్పకుండా నేలచూపులు చూస్తోంది.

"ఆల్‌రైట్! నువ్వు చెప్పవుగానీ..." అంటూ బెల్‌కొట్టి ఆయాని పిలిచి తొమ్మిదోక్లాసు 'బి' సెక్షన్‌లోని రమ అనే అమ్మాయిని తీసుకురమ్మన్నారు.

సుశీ కూడా ఆయాతో వెళ్లబోయింది.

"నువ్వెక్కడికి? బయటికిపోయి, రమకు కనిపించకుండా కూచో" అన్నారు. సుశీ బయటపడి పక్కనే గోడదగ్గర ఉన్న బెంచీమీద కూర్చున్నది. రమ వచ్చింది. లోపలికి వెళ్లింది. హెచ్.ఎమ్. ఆమెను పరీక్షగా చూసారు. చేతులు కట్టుకుని నిలబడింది. శుభ్రమైన యూనిఫారం. పైకి మడిచి కట్టిన పొడుగాటి రెండు జడలు.

"నువ్వు రోజూ ఏడుస్తున్నావా? ఎందుకు?" అనడిగారు సూటిగా. "వసంత్ నిన్ను ఏడిపిస్తున్నాడా? చెడ్డమాటలంటున్నాడా? ఏమిటవి?" అన్నారు హెచ్.ఎమ్.

రమ పాలరాయి బొమ్మలా నిలబడింది. కళ్లవెంబడి నీళ్లు కారిపోతున్నాయి. చెంపలు తుడుచుకుంది. ఎర్రగా కందిపోయింది ముఖం. జేబు తడిమి ఒక కాగితం తీసి హెచ్.ఎమ్.కి యిచ్చింది.

"డార్లింగ్ రమా! ఐ లవ్ యూ. నువ్వు లేకుంటే నేను బతకను. నా ప్రేమ యిష్టం ఉంటే రేపు గులాబీ పువ్వు తలలో పెట్టుకునిరా. ఈ విషయం పెద్దవాళ్లకి చెప్తే ప్రాణం తీసుకుంటాను" అని ఉంది ఆ చీటీలో.

విషయం వెంటనే అర్థమైంది. "నువ్వు ఏమన్నావు? ఏమీ అనకుండా ఊరుకున్నావా?" అనడిగారు ఆమె.

అవునన్నట్టు రమ తలూపింది.

"ఎప్పట్నుంచి యిలా మొదలుపెట్టాడు?" అంటే...

"పదిహేను రోజులు..." అని సన్నగా మళ్లీ ఏడుస్తోంది రమ.

"నాకు చెప్పలేదేం? పోనీ మీ యింట్లో చెప్పావా?" అనడిగితే లేదని గట్టిగా తలూపింది. "మరి ఎందుకు చెప్పలేదు?" అనడిగారు.

"నాకు భయం" అన్నది.

కేసు బాగానే అర్థమౌతోందిగానీ పరిష్కరించడం ఎలా?

"సరే, నువ్వు వెళ్లు. బుర్ర పాడుచేసుకోకు. పరీక్షలు వస్తున్నాయి. బాగా చదవాలి. ఫస్టు

తురగా జానకీరాణి

ర్యాంక్ స్టూడెంట్‌వి" అన్నారు. రమ సరేనని తలూపి వెళ్లిపోయింది. వెంటనే సుశీ హెచ్.ఎమ్. గారి రూమ్‌లోకి దూరింది.

"ఏమన్నది మేడమ్?" ఈ కాసేపట్లో మాట్లాడే ధైర్యం వచ్చేసింది.

"నువ్వు చెప్పటం మంచిపనే అయింది. కానీ సుశీ, యింకెవరితోటీ అనకు. రమ యింకా ఫీలవుతుంది. నేను చూసుకుంటాను యిక" అన్నారు. నమస్తే చెప్పి క్లాసుకి వెళ్లిపోయింది సుశీ. పీరియడ్ అయిపోయి సోషల్‌టీచర్ బయటికి వెళ్లగానే తుర్రునపోయి రెండోవరుసలో తన సీట్లో కూచుంది. రమ, సుశీని చూసి తలవంచుకుంది.

ఇంకా టీచర్ రాలేదు. ఇంతలో ఆయా వచ్చింది. "వసంత్‌ని హెచ్.ఎమ్. మేడమ్ రమ్మంటున్నారు" అన్నది బిగ్గరగా. క్లాసంతా ఒక్కసారి నిశ్శబ్దం అయిపోయింది. వసంత్ అటూ యిటూ ఉన్న తన ఫ్రెండ్స్ వంక చూసి, లేచి దర్జాగా నడుస్తూ బైటకు వెళ్లాడు.

"కమిన్" అన్నారు హెచ్.ఎమ్. "గుడ్ మార్నింగ్" చెప్పి నిలబడ్డాడు. "వసంత్ నువ్వేనా?" అనడిగితే తలకాయ ఊపాడు. "ఇల్లారా!" అని రమ తనకిచ్చిన చీటీ అతనికిచ్చారు. ఒక్కక్షణం తెల్లముఖం వేసాడు. చీటీ చేతిలో నలిపేస్తూ, ధీమాగా తలెత్తాడు.

"అలా నలిపేయకు. సాఫీగా చేసి నాకివ్వు" అని అడిగి పుచ్చుకున్నారు. "రమ చాలా అందంగా ఉంటుందా?" అన్నారు. ముఖం ఎరుపెక్కిపోయింది వసంత్‌కి. "ఊ" అన్నాడు.

"మీ అమ్మగారి కంటే, అక్కయ్యకంటే అందంగా ఉంటుందా?" అన్నారు.

"నాకు అక్కయ్యలు లేరు" అని తప్పించుకునే జవాబిచ్చాడు వసంత్.

"అతి తెలివి చూపించకు. సరే, మీ చెల్లెలు కంటే అందంగా ఉంటుందా?" అన్నారామె.

"ఔను" అన్నాడు వసంత్.

"మీ చెల్లెలు అంటే నీకు ప్రేమేనా?" అనడిగారు.

"ఊ, చాలా యిష్టం" అన్నాడు.

"ఆమెకి రాయవుగా యిలాంటి ఉత్తరాలు?" అన్నారామె.

తికమకపడ్డాడు వసంత్. గబగబా తల ఊపాడు.

"ఎందుకు రాయవు? రమ ఏమన్నది?" అనడిగారు హెచ్.ఎమ్. సమయానికి ఇద్దరు ముగ్గురు టీచర్లు వచ్చారు రూమ్‌లోకి.

"రమ ఏమన్నది ఈ మాటలు తనతో నువ్వు మాట్లాడితే?" అనడిగారు.

నోరు మెదిపీ మెదపనట్టు "ఛ, నాకు అసహ్యం, అన్నది" అని జవాబిచ్చాడు.

"సరే, మీ చెల్లెలికి ఎందుకు రాయవు?" కొంచెం గట్టిగా గద్దించి అడిగారామె. వసంత్‌కి మాటరాలేదు. "ప్రేమ అంటే ఏమిటి?" జవాబులేదు.

"ప్రేమ అంటే ఇష్టం. అమ్మమీద ప్రేమ ఉంటుంది. నాన్నమీద, తాతమీద, అవ్వ మీద ప్రేమ ఉంటుంది. పెంచిన కుక్కపిల్లమీద ప్రేమ ఉంటుంది. కానీ అన్ని ప్రేమలూ ఒకేరకం కావుగా?" అన్నారామె.

వసంత్‌కి కొంచెంగా అర్థమౌతోంది.

"చూడు వసంత్! మీది చదువుకునే వయ




స్సు. చదువు మీద ప్రేమఉండాలి. నీ క్లాసు వాళ్లందరి మీద, అబ్బాయిలు కానీ, అమ్మాయి లు కానీ – వారందరిమీద యిష్టం ఉండాలి. వారి స్నేహం నీకు యిష్టంగా ఉండాలి. ఆట పాటలతో సరదాగా కాలం గడపాలి. నువ్వు పెద్ద అబ్బాయివికాదు. రమ పెద్ద అమ్మాయి కాదు. మీరింకా విద్యార్థులు. అంటే విద్యను అర్థించేవారు. మీ గురువుల నుండి విద్యనూ, విజ్ఞానాన్నీ కోరేవారు. అందుకే బడికి వస్తు న్నారు. డిగ్రీలు పూర్తయి నీ కాళ్లమీద నువ్వు నిలబడేవరకూ పెద్ద ఆలోచనలు రాకూడదు. బుర్ర పాడు చేసుకోకూడదు. తెలిసిందా?" అని ఆగారు మేడమ్.

హెచ్.ఎమ్. యింత చక్కగా మాట్లాడుతోం టే మనసులో ఏదో కరిగిపోయి, కట్టలు తెంచు కున్నట్టు ఏడుపొస్తున్నది వసంత్‌కి.

"ఎస్ మేడమ్!" అన్నాడు పూడుకుపోయిన గొంతులోంచి.

"నీ ఆలోచన మార్చుకో. రమని సోదరీ అని పిలు, సిస్టర్ అని పిలు, చెల్లీ అని పిలువు. నీ మనసు మారిపోతుంది. నీ క్లాస్ మగపిల్లలకి యీ సంగతి రహస్యంగా చెప్పు. చదువే మీ లక్ష్యం – చదువే మీ ధ్యేయం ఔనా?" అంటూ ఒక కాగితం మీద పెన్నుతో చిన్న చీటీ వ్రా సారు.

"మీ పేరెంట్సుకి యివ్వు" అని యిచ్చారు. మెల్లగా భుజం తట్టారు. వసంత్ చీటీ జేబులో పెట్టుకోబోతుంటే, "ముందు నువ్వు చదువు" అన్నారు.

విప్పి చూస్తే అందులో రెండే రెండు వాక్యా లున్నాయి –

"వసంత్ అమ్మా నాన్నలకి – మీ వసంత్‌నీ, మిగిలిన పిల్లల్నీ కూడా ఎక్కువగా టి.వి., సిని మాలు చూడనివ్వకండి. వారికి వయస్సుకి మించిన, అనవసరమైన ఆలోచనలు కలుగు తాయి". ●